

ఇసుక లారీలు నిలిపివేయాలని ధర్నా

పెరవలి : మండలంలోని కానూరు-పెండ్యాల రోడ్డులో ఇసుక లారీల రాకపోకలను నిలిపివేయాలంటూ రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. కానూరు సెంటర్ నుంచి ఇసుక ర్యాంపునకు వెళ్లే రహదారిపై నుంచి నిత్యం ఇసుకలారీలు రాకపోకలు సాగిస్తున్నాయని. ఫలితంగా సిసి రోడ్డు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అంతేకాకుండా సిసిరోడ్డుపై లారీ టైర్ల మట్టి పేరుకుపోతుందన్నారు. వర్షం వస్తే జారుడుగా మారుతుందన్నారు. ఈ సమయంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారన్నారు. ప్రతి రోజూ రైతులు, కూలీలు పొలం పనుల నిమిత్తం ఈ రోడ్డుగుండానే ప్రయాణిస్తారన్నారు. వర్షం సమయంలో ఈ రోడ్డుపై నుంచి వెళ్తే ప్రమాదాలకు గురవుతున్నామని తెలిపారు. ఈ ధర్నాలో గారపాటి నరేంద్ర, గారపాటి శ్రీను, వాకలపూడి వెంకటేశ్వరరావు, బొప్పన వెంకటేశ్వరరావు, పెనుగుర్తి నాగరాజు, ఎం.యేసు, బి.సాంబయ్య, ఎం.సత్యనారాయణ, వి.శ్రీను పాల్గొన్నారు.

చరిత్ర ఘనం... నిర్వహణ శూన్యం

- కాటన్ బ్యారేజీ రోడ్డు ఆధునికీకరణకు మోక్షం ఎప్పుడు?
- కోనసీమ జిల్లా పరిధిలో గతుకుల రహదారి
- రాకపోకలకు ప్రయాణికుల అవస్థలు



శిథిలమైన బ్యారేజీ రోడ్డు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉభయగోదావరి జిల్లాలకు ధవళేశ్వరం బ్యారేజీ తలమానికంగా నిలుస్తోంది. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఈ కట్టడం నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో దీని మనుగడకు ప్రమాదం ఏర్పడింది. పోలవరం నుంచి ధవళే శ్వరం బ్యారేజ్ వరకు 41.80 కిలోమీటర్ల మేర అఖండ గోదావరిగా ఉంది. కాటన్ బ్యారేజీపై ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకు ఉన్న రహదారిపై ప్రయాణం ప్రయాసగా మారింది. గుంతలు పడిన ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల రూ.2 కోట్లు వెచ్చించి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని రహదారిని పునరుద్ధరించారు. కోనసీమ జిల్లా పరిధిలోని 800 మీటర్ల రహదారిని పునరుద్ధరించాల్సి ఉంది. నిత్యం వేలాది మంది వాహనదారులు ఈ బ్యారేజీపై రాకపోకలు సాగిస్తుండగా, కొందరు గుంతల వల్ల ప్రమాదాలు బారిన పడుతున్నారు.

ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకు 5.837 కిలోమీటర్ల పొడవు రహదారి ఉంది. 2014వ సంవత్సరంలో ధవళేశ్వరం, బొబ్బర లంక, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లను కలుపుతూ నిర్మించిన ఎంబ్యాక్‌మెంట్ రోడ్డుతోపాటు ఆర్మ్‌లపై ఉన్న కాంక్రీట్ నిర్మాణంపై వేసిన బీటీ లేయ ర్ కూడా ఛిద్రమైపోయింది. అయితే ఎట్టకేలకు ఈ ఏడాది మార్చిలో రహదారి పునరుద్ధరణ జరిగింది. ఈ పనులకు సైతం కాంట్రాక్టర్లను టెండర్లు వేయమని అభ్యర్థించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో పూర్తిచేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం, ప్రస్తుతం పనిచేసినా సొమ్ములు వస్తాయో రావో అనే భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సమాచారం. 1817-52 మధ్య కాటన్ ఆనకట్ట నిర్మించారు. 110 ఏళ్ల తర్వాత 1961లో బ్యారేజీ శిథిలావస్థకు చేరుకుందని గుర్తించారు. 1970లో రూ. 26.59 కోట్లతో నిర్మాణానికి ఆమోదించి కొత్త ఆనకట్ట నిర్మించారు. ఆ పనులు పూర్తయ్యేసరికి రూ.70 కోట్లు ఖర్చయ్యాయి. గత పుష్కరాల సమ యంలో బ్యారేజీపై తారు రోడ్డు నిర్మాణంతో పాటు రంగులు వేశారు. అనంతరం 5.837మీ పొడవు ధవళేశ్వరం, ర్యాలి, మద్దూరు, విజ్జే శ్వరం మొత్తం నాలుగు ఆర్మ్ 2017-19లో ప్రభుత్వం రూ. 30 కోట్లు కేటాయించింది. కొంత మొత్తంతో స్పిల్వే 175 గేట్లలో 52 గేట్లకూ చిన్న మరమ్మతులు చేసి ఊరుకున్నారు. అనంతరం వదిలేయడంతో గేట్లు ఎత్తే జనరేటర్ దెబ్బ తింది. స్టాప్ లాక్ గేట్లకు సంబంధించిన క్రేన్ మరమ్మతులకు గురైంది. బ్యారేజీ అనుసంధాన రహదారి దెబ్బతినడంతో ప్రమాదాలు జరుగుతు దీపాల వెలుగులు కరవయ్యాయి. ముఖ్యమైన బ్యారేజీకి సపోర్టుగా ఉన్న పాత ఆనకట్ట పలుచోట్ల దెబ్బతింది. బీటలు వారి ప్రమాదాన్ని సూచిస్తోంది. పిచ్చుక లంక రేవులో రాళ్లు లేచిపోయాయి.

బ్యారేజీ ఒడ్డున కోతకు గురికాకుండా ఉండేందుకు నిర్మించిన రాతికట్టుబడి కూడా ఛిద్రమైంది. బ్యారేజీకి ప్రపంచ వారసత్వ సంపదగా గతేడాది గుర్తింపు లభించిన విషయం విదితమే. అయితే పాలకులు కేవలం రంగులు వేసి చేతులు దులుపుకున్నారు. ఈ బ్యారేజీని తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదానిచ్చే ఉద్యానవనాలు పూర్తిగా పాడయ్యాయి. బ్యారేజీ అందాలు తిలకించేందుకు వచ్చిన వారు సేద తీరేందుకు లేదు. ఫౌంటెన్లు పని చేయడ్లేదు. పిచ్చిమొక్కలు దర్శనమిస్తు న్నాయి. బ్యారేజీ పొడవునా కాపలాకాసేందుకు లస్కర్ల కొరత ఉంది. విద్యుత్ దీపాలు సైతం వెలగడం లేదు. కేవలం ఒక్క ఎలక్ట్రీషియన్ మాత్రమే విధుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి భర్తీ చేయ కపోవడంతో ఇబ్బందులు తప్పట్లేదు. బ్యారే జీపై కాపలా కూడా పూర్తి స్థాయిలో కరువైంది. ప్రపంచ వారసత్వం సంపదగా గుర్తింపు పొందిన నేపథ్యంలో ప్రత్యేక దృష్టి పెట్టి గత వైభవాన్ని తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే టెండర్లు

కోనసీమ జిల్లా పరిధిలో 800 మీటర్ల మేర రహదారి వేయాల్సి ఉంది. ఇటీవల ప్రభుత్వం రూ.35 లక్షలు మంజూరు చేసింది. కలెక్టరు అనుమతితో త్వరలోనే టెండర్లు పిలవనున్నాము. ఇటీవల రూ.2 కోట్ల వ్యయంతో రహదారుల ఏర్పాటు ఇతర కీలకమైన పనులు చేయించాము.

- కాశీ విశ్వేశ్వరరావు, గోదావరి హెడ్ వర్క్స్ ధవళేశ్వరం బ్యారేజీ



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకుల, కార్యకర్తలు

వరద బాధితుల కోసం సిపిఎం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరం నగరంలోని కోటగుమ్మం సెంటర్‌లో విరాళాల సేకరణ నిర్వహించారు. విజయవాడ నగరంలో బుడమేరు పొంగడం వల్ల చాలా ప్రాంతాలు నీట మునిగి వేలాది మంది ప్రజలు తీవ్రమైన ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి తోడుగా స్వచ్ఛంద సంస్థలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సిపిఎం ముంపు ప్రాంతాల బాధితులకు సహాయార్థం అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. వరద బాధితుల సహాయర్థం రాజమండ్రి నగరంలో ప్రజల నుంచి విరాళాలు సేకరించి పంపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజమహేంద్రవరం నగర కార్యదర్శి బి పవన్, నాయకులు కె.రామకృష్ణ, తులసి, సుబ్రహ్మణ్యం, పి.రామకృష్ణ, రాంబాబు, అశోక్, సుధ తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వినాయక చవితి పండుగ సందర్భంగా పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునేందుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్‌పి డి.నరసింహకిషోర్ స్పష్టం చేశారు. మంగళశారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక పోర్టల్ ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో అల్లర్లకు, ఘర్షణలకు తావు లేకుండా గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. సాంస్కతిక కార్యక్రమాల పేర అశ్లీల నత్యాలు, రికార్డింగ్ డ్యాన్సులు వంటివి నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 379 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించామన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు 7995095800 మొబైల్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ పంపితే నిరభ్యంతర పత్రం(ఎన్‌ఒసి) కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా ఫోన్‌కు పంపుతామన్నారు. అనంతరం ఉత్సవ కమిటీలు ganeshutsav.net అనే వెబ్ సైట్‌లో కమిటీ సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు చేయు ప్రదేశం, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్టాపన చేసే రోజు, నిమజ్జనం వంటి వివరాలు పూర్తిచేయాలన్నారు. దరఖాస్తు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకి వెళ్తుందన్నారు. ఎస్‌హెచ్‌ఒ ఆధ్వర్యంలో పురపాలక శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖల సిబ్బంది సంబంధిత ప్రదేశాన్ని సందర్శించిన తరువాతనే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. అనుమతికి అవసరమైన రుసుము వివరాలు తెలియజేస్తారన్నారు. మీ సేవా కేంద్రంలో తగిన రుసుము చెల్లించి రశీదును వెబ్ సైట్‌లో అప్లోడ్ చేసిన తర్వాత ఎస్‌హెచ్‌ఒ పరిశీలన అనంతరం నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారన్నారు. దీన్ని ప్రింట్ తీసి గణేష్ మండపంలో ఉంచాలన్నారు. పోలీసులు సందర్శన సమయంలో క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి తనిఖీ చేస్తారని తెలిపారు.

ఎరువుల కొరత లేదు

సహాయ వ్యవసాయ సంచాలకులు చంద్రశేఖర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కొవ్వూరు డివిజన్ పరిధిలో ఎరువుల కొరత లేదని కొవ్వూరు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.చంద్రశేఖర్ తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన 'ఎరువు బరువు' కథనానికి ఆయన స్పందించారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 31,400 హెక్టార్లలో వరి, చెరకు, అరటి వంటి పంటలు పండిస్తున్నారు. డివిజనులో వివిధ రకాలైన ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా 4,529 మెట్రిక్ టన్నులు, డిఎపి 429 మెట్రిక్ టన్నులు, ఎంఒపి1,244 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 4,315 టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్పేట్ 1,516 టన్నులు డీలర్లు, సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు అవసరం లేని ఎరువులను అంట గట్టరాదని డీలర్లకు సూచించారు. ఎరువు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. ఈపాస్‌లో తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు.

ఆశ కార్యకర్తలకు ఎంపిపి సూచనలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ తరచూ గ్రామాల్లో పర్యవేక్షణ చేయాలని ఎంపిపి జొన్నకూటి పోసిరాజు ఆశ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని మలకపల్లి పిహెచ్‌సి వద్ద మంగళవారం జరిగిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఎంపిపి పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ డెలివరీలు జరిగేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి అంటువ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చేయించాలన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

5న మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్


ఈ నెల 5న బొమ్మూరు న్యాక్ సెంటర్‌లో మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో సెప్టెంబరు నెలకు చెందిన జాబ్ క్యాలెండర్‌ను కలెక్టరు ఆవిష్కరించి మాట్లాడారు. చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువత కోసం వివిధ కంపెనీల్లో 610 ఉద్యోగావకాశాలున్నాయని తెలిపారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో ఈ మేళాను నిర్వహిస్తున్నారన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే వారు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి అని జిల్లా ఉపాధి సంస్థ అధికారి హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. డిగ్రీ, ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఇంటర్, పదవ తరగతి పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. https://forms.gle/vAhpUpciMBVn5jiలో పూర్తి వివరాలతో రిజిస్టర్ చేసుకోవా లన్నారు. మేళాకు రెజ్యూమెలతో పాటు ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో 10 గంటల్లోగా హాజరవ్వా లన్నారు. వివరాలకు 7396740041 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉత్సవ కమిటీలతో సమావేశం

ప్రజాశక్తి- చాగల్లు

మండలంలో వినాయక ఉత్సవ కమిటీలతో ఎస్‌ఐ కె.నరేంద్ర మంగళవారం సమావేశం నిర్వహించారు. నిర్వాహకులు నిర్వహించాల్సిన పనులు, చేయకూడని పనులపై అవగాహన కల్పించారు. మండపం ఏర్పాటుకు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండలంలోని ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సమస్యలపై ఆశాల నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లను నెరవేర్చాలని, పని ప్రాంతాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలంటూ జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లు మంగళవారం పిహెచ్‌సిల ఎదుట ధర్నాలు నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలను అందించారు

చాగల్లు, బ్రాహ్మణగూడెం, కలవలపల్లి, మార్కొండపాడు పిహెచ్‌సిల వద్ద ఈ ధర్నాలు జరిగాయి. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ మాట్లాడారు. ఆశా వర్కర్లకు గ్రూప్ ఇన్సూరెన్స్, మెటర్నిటీ లీవ్స్, మరణించిన వారికి మట్టి ఖర్చులకు రూ.20వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.60వేలు, రికార్డ్స్ నాణ్యమైన ఫోన్స్, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్ల ఒప్పందం వంటి జిఒలను వెంటనే ఇవ్వాలన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌కి వినతిపత్రం అందించారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు యూనియన్ నాయకులతో జరిపిన ఒప్పందాల జీవోలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలని, లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని, మహిళలకు రక్షణ కల్పించే విధంగా కఠినమైన చట్టాలను చేయాలని డిమాండ్ చేవారు. ఆశ వర్కర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.కస్తూరిబాయి, కె.సుధారాణి, డి.ముత్యాలరాణి, పుష్పలత, పి.వెంకటలక్ష్మి, డి.నాగమణి, లావణ్య, సునీత, కామాక్షి, మరియమ్మ, వెదులమ్మ, కనకదుర్గ, కుమారి, థెరిసా పాల్గొన్నారు.

తాళ్లపూడిలో డిమాండ్లు నెరవేర్చాలని, సమస్యలను పరిష్కరించాలంటూ ఆశాలు మంగళవారం పిహెచ్‌సి వద్ద ధర్నా నిర్వహించారు. ఒప్పంద జిఒలను వెంటనే విడుదల చేయాలన్నారు. కోల్‌కతా ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పిహెచ్‌సి వైద్యాధికారి హారికగుప్తాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆశాలు రాఘవ, సుధారాణి, విజయకుమారి, సునీత, పోసమ్మ, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో...



చాగల్లులో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

దేవరపల్లిలో వేతనాలు పెంచాలని కోరుతూ పిహెచ్‌సి వద్ద ఆశాలు ధర్నా నిర్వహించారు. గతంలో ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల మేరకు జిఒలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకులు మల్లిపూడి వెంకటలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, ఇందిరా, స్వర్ణ, ఝాన్సీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రత్నాజీ పాల్గొన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. **సీతానగరం** పిహెచ్‌సి వద్ద మండల ఆశావర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గతంలో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. అనంతరం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఎవికె.చైతన్యకు వినతి పత్రం అందించారు. యూనియన్ నాయకులు కుమారి,వీరమణి, వీరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లా వ్యాప్తంగా పోషకాహార వారోత్సవాలు జరిగాయి. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు.

తాళ్లపూడి పిహెచ్‌సి వైద్యాధికారి హారికాగుప్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. బయట లభ్యమయ్యే పానీపూరి, న్యూడిల్స్, బర్గర్స్ వంటి జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఇళ్లల్లో తయారు చేసుకునే పిండి వంటలు మాత్రమే తీసుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. **గోపాలపురం** మండలంల వాదాలకుంటలో అంగన్‌వాడీ కేంద్రం-12లో పౌష్టికాహార మసోత్సవాలను నిర్వహించారు. సర్పంచ్ జొన్నకూటి మణమ్మ, సిడిపిఒ యువి.పద్మావతి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు సంపూర్ణ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం ప్రదర్శన, ప్రీ స్కూల్ మెటీరియల్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** దమ్మెన్ను అంగన్‌వాడీ కేంద్రం-2లో పౌష్టికాహార వారోత్సవాలను సర్పంచ్ గురజర్ల వీరవెంకటసత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. సూపర్‌వైజర్ టిఎల్.బాలసరస్వతి మాట్లాడారు. సెప్టెంబర్ 30 వరకు పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. గర్భిణులు, బాలింతలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహార విలువలు కలిగే ఆహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం...

ప్రజాశక్తి - యంత్రాంగం

విజయవాడ వరద బాధితులకు జిల్లాకు చెందిన పలు సంస్థలు, వ్యక్తులు ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఆహారం, వాటర్‌ప్యాకెట్లు, నిత్యావసర సరుకులను అందిస్తున్నారు. **చాగలు** మండలం బ్రాహ్మణగూడెం గ్రామంలో రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3వేల ఆహార పొట్లాలు, 4 వేల వాటర్ బాటిళ్లు, బిస్కెట్స్, వాటర్ పాకెట్స్‌ను వాహనాల్లో పంపించారు. ఈ వాహనాలను కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరంలో** శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు ఆహార పదార్థాలను వాహనాల్లో పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరదల్లో చిక్కుకుని నానా అవస్థలు పడుతున్న ముంపు బాధితుల కోసం తమ విద్యాసంస్థల నుంచి ఆహార పదార్థాల వాహనాల్లో పంపామన్నారు. ఏడు వేల మందికిపైబడి సరిపడే పదివేల బిర్యానీ ప్యాకెట్లు బ్రెడ్, పాలు, బిస్కెట్లు, తాగునీరు పాకెట్లను పంపిచామన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, విద్యాసంస్థల వైస్ చైర్మన్ సుప్రియ, బూరుగుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పంపుతున్న శశి యాజమాన్యం

సీతానగరంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వేయి ఆహార పొట్లాలు అందజేశారు. ఎపిఒ మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం సిసిలు మేర్ని నాయుడు, రామచక్రంలతో విజయవాడకు ఆహారాన్ని వాహనాల్లో పంపామన్నారు.

రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు విజయవాడ 5వ వార్డులోని వరద బాధితులకు ఆహారం, పాలప్యాకెట్లు, తాగునీటిని అందిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తీవ్రమైన చలికి తట్టుకోలేకపోతున్న వారికి దుప్పట్లను అందించారు.



బాధితులకు దుప్పట్లను అందిస్తున్న ఎంఎల్ఎ బత్తుల దంపతులు

తాళ్లపూడి కొవ్వూరు డివిజన్‌లోని ప్రైవేటు విద్యాసంస్థల సంఘం (అపుస్మా) తరపున రూ.2.05లక్షల విలువ గల 5వేల ఆహార పొట్లాలు, పదివేల మంచినీళ్ల బాటిళ్లను విజయవాడ వరద బాధితుల కోసం పంపించామని అపుస్మా డివిజన్ అధ్యక్షులు వివి.అనీష్ తెలిపారు.

కడియం... సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో 3 వేలు ఆహార పొట్లాలను వరద బాధితుల కోసం పంపించారు. అలాగే స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి 25 వందల ఆహార పొట్లలను విజయవాడకు తరలించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెనుమాక కొండబాబు, సెక్రటరీ గాద నాగేశ్వరరావు, డైరెక్టర్లు గట్టా కృష్ణభగవాన్, రావిపాటి రామకృష్ణ, తాడాల బాల మురళికృష్ణ, జంగా సుబ్బారావు, గరగా నాగేశ్వరరావు, అడ్డగర్ల రమేష్, గాజుల రత్తయ్య, తాడాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్‌బాబు రాజమహేంద్రవరం రూరల్‌లో ఉన్న వెంకట నగరం, తొర్రేడు, సీతానగరం మండలంలో కాటవరం, ములకలంక, జాలిముడిలో వరద ముంపు ప్రాంతాలను మంగళవారం సందర్శించారు. అక్కడ కల్పించిన వసతులను, సదుపాయాలను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ఎటువంటి అసౌకర్యం ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని బీమోలులో పిచ్చికుక్క దాడిలో ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన ఇంటి పేరాజు, అతని కుమారుడు ఇంటి బులరాజు పొలంలో ఉండగా వారిపై పిచ్చికుక్క అమాంతంగా దాడికి దిగింది. అదే ప్రాంతంలో మింటిమి వెంకట్రావు పొలంలో పశువులను కాస్తుండగా దాడి చేసి గాయపరిచింది. వెంటనే వారిని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేసి వైద్యం అందజేశారు.

పలువురు జనసేనలో చేరిక


ప్రజాశక్తి - నల్లజర్ల

వైసిపి నాయకులు పసుపులేటి బాలాజీ, అచ్యుత పెదరామారావు, పారేపల్లి రామాచార్యులు ఆధర్యంలో 150 మంది మంగళవారం జనసేనలో చేరారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, ఆవపాడు గ్రామ సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ వారికి జనసేన కండువా కప్పి ఆహ్వానించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గోపాలపురం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఫీవర్స్ సర్వేను నిర్వహించాలని హుకుంపేట పిహెచ్‌సి వైద్య అధికారి బివివి.దుర్గాభవాని వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని హుకుం పేట పిహెచ్‌సి పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశాలకు ఆశాడే సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే పురుడు పోసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.



డాక్టర్ భవానిని సత్కరిస్తున్న సిబ్బంది

అనంతరం ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రాలు తీసుకున్న వైద్యాధికారి బివివి.దుర్గాభవానిని, కరగపాడు సచివాలయం ఆరోగ్య కార్యకర్త నాగమణిని సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఎన్.గాయత్రి, సిహెచ్‌ఒఆర్.రూతమ్మ, సూపర్‌వైజర్లు శ్యాంసుందర్, కృష్ణవేణి, త్రిమూర్తులు సిబ్బంది పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించొద్దంటూ వినతి

ప్రజాశక్తి - చాగల్లు

తమను తొలగించరాదంటూ వైన్ షాపుల్లో పనిచేస్తున్న సేల్స్‌మెన్‌లు, సూపర్‌వైజర్లు మంగళవారం చాగల్లు లిక్కర్ డిపో అసిస్టెంట్ మేనేజర్ సురేష్‌కు వినతి పత్రం అందించారు పంపన తులసీధర్, చిన్నం సుమన్, తదతరులు వినతిపత్రం ఇచ్చినవారిలో ఉన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 36 మంది పనిచేస్తూ ఉపాధి పొందుతున్నామనానరు. ఈ నెలాఖరు నుంచి గవర్నమెంట్ షాపులు బంద్ చేయనున్నట్టు వార్తలు వస్తున్నాయన్నారు. తమను తొలగించకుండా చూడాలని కోరారు.

రొట్టెలు, పాలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం

కంబాల శ్రీనివాసరావు చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా గోకవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులు, గర్భిణులకు పండ్లు, పాలు, రొట్టెలను మంగళవారం పంపిణీ చేశారు. ప్రతి మంగళవారం ఆయన అ సేవాకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.ప్రదీప్‌కుమార్, మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఉమా పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న 12 మంది అరెస్ట్

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని రాజవరం గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్ఐ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో మంగళవారం దాడి చేశారు. ఈ సందర్భంగా 12 మంది పేకాడుతున్న వారిని అరెస్టు చేశామని, వారు వద్ద నుంచి రూ.8990 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ విలేకరులకు తెలిపారు

వ్యభిచార గృహంపై దాడి

ప్రజాశక్తి-తాళ్లరేవు

కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం నీలపల్లి జగనన్న కాలనీలో మంగళవారం వ్యభిచారం గృహం పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడుల్లో నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలను, ఒక పురుషుడినీ కోరంగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ప్రజలు ఫిర్యాదు మేరకు కోరంగి ఎస్ ఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జగనన్న కాలనీలో ఒక గృహం పై దాడి చేయగా ముగ్గురు పట్టు బడ్డారు. గత కొంతకాలంగా నీలపల్లి పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీలో యానాం మెట్టకూరు కి చెందిన ఒక మహిళ వ్యభిచారం నిర్వహిస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం పోలీసులు నేరుగా దాడి చేయగా ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకున్నారు.

వ్యక్తి పై కత్తితో దాడి

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక పాదగయ జంక్షన్ బై పాస్ రోడ్డు పై ఒక వ్యక్తిపై మంగళవారం కత్తితో దాడి జరిగింది. ఘటనపై బాధితుడు కె సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం తాను గతంలో కొంతమంది వ్యక్తులతో కలిసి చిట్ ఫండ్ కంపెనీ నిర్వహించనన్నాడు. కంపెనీ భాగస్వాములకు తనకు మధ్య వివాదాలు తలెత్తాయన్నాడు. ఈ విషయంపై పట్టణ పోలీస్ స్టేషన్, జిల్లా ఎస్పి కార్యాలయంలో ఫిర్యాదు చేశానన్నారు. తాను మంగళవారం సాయిబాబా గుడి వద్ద ఉండగా చిట్ ఫండ్ కంపెనీ భాగస్వాములలో ఒకరైన భాస్కర్‌రావు తను సామర్లకోట వెళ్ళాలని పాదగయ జంక్షన్ వద్ద దించమని అడగాడని తెలిపాడు. ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా పాదగయ జంక్షన్ సమీపానికి వచ్చేసరికి బండిపై వెనక కూర్చున్న భాస్కర్ రావు తన పై కత్తితో ఒక్కసారిగా దాడి చేసి తన వద్ద ఉన్న నగదు బ్యాగును తీసుకొని పరారయ్యాడని బాధితుడు సత్యనారాయణ తెలిపాడు. గాయాలు పాలైన బాధితుడు స్థానిక ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి జైలు, ఇద్దరికి జరిమానా

ప్రజాశక్తి-సామర్లకోట

సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు న్యాయమూర్తి జరిమానా, మరో ఇద్దరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ పివిఎస్.మూర్తి మంగళవారం తెలిపారు. ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డ్రంక్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా నలుగురు మందుబాబులు పట్టుబడ్డారన్నారు. వారిని కాకినాడ స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి నరసింహారావు ముందు హాజరు పరచగా వారికి జరిమానా, జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ చెప్పారు.

వివాహిత ఫిర్యాదుపై కేసు నమోదు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పరాయి వ్యక్తితో మాట్లాడుతున్నాననే నెపంతో అక్రమ సంబంధం అంటగట్టి తమ అత్తింటి వారు, గ్రామ పెద్దల సమక్షంలో బలవంతపు వివాహం చేయించారని ఓ వివాహిత చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇవి.. ఠానేలంక చిన్న పేట కు చెందిన మెల్లం దయామణి అదే గ్రామంలోని ఉన్నత పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తుంది. ఆమె భర్త నాగార్జున కూడా అదే పాఠశాలలో వాచ్ మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున తన ఉద్యోగ విషయమై వాకింగ్ వెళ్తున్న అదే గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు వివాహితుడు అయిన ఇసుకపట్ల ఈశ్వర్ కుమార్‌తో మాట్లాడుతోంది. అది చూసిన అత్తింటి వారు తనకు అతనికి అక్రమ సంబంధం అంటగట్టి పెద్దల సమక్షంలో తగువుపెట్టి తనకు ఈశ్వర్ కుమార్ కు అంబేద్కర్ విగ్రహం వద్ద బలవంతంగా వివాహం జరిపించారని దయామణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమ వసూలుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

మండల మాల మహానాడు పేరిట కొంతమంది వ్యక్తులు పలువురు నుంచి అక్రమంగా సొమ్ములు వసూలు చేశారని ముమ్మిడివరం మాల మహానాడు జెఎసి నాయకులు మంగళవారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 21న భారత్ బందు పిలుపు మేరకు ముందు రోజు కొంతమంది వ్యక్తులు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రయివేటు ఆసుపత్రులు, వ్యాపార సంస్థలు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి తదితరులు నుంచి సుమారు రూ.70 వేల నుంచి రూ.80 వేలు వరకు వసూలుకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో సిసి కెమెరా ఫుటేజ్ ల ఆధారంగా అక్రమ వసూలుకు పాల్పడిన వ్యక్తులను గుర్తించామని, వారిపై చర్యలు తీసుకోవాలని మండల మాల మహానాడు జెఎసి నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బెల్లపు ఊట స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లపూడి

గోపాలపురం, తాళ్లపూడి మండల సరిహద్దులో పోలీసులు దాడులు నిర్వహించి 200 లీటర్ల చొప్పున బెల్లపు ఊటను నిల్వ ఉంచిన 40 పీపాలను స్వాధీనం చేసుకున్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలవ గట్టు సమీపంలో వీటిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి యజమానులు ఎవరిన్నది తెలియలేదని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఉద్యోగ భద్రత కోసం బెవరేజెస్ సిబ్బంది వినతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, గండేపల్లి

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ నెల 7న శాంతియుతంగా బంద్ నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తూర్పు గోదావరి, కాకినాడలో పలువురు అధికారులకు వినతిపత్రాలు అందించారు. రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్స్, సేల్స్‌మెన్, వ్యాచ్‌మెన్‌లు కలిసి డిపో మేనేజరుకు వినతిపత్రం అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్‌పిలకు వినతిపత్రాలు అందించారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో తమ ఉద్యోగాలకు ఎటువంటి హామీ ఇవ్వని కారణంగా బంద్ చేపట్టినట్టు తెలిపారు. 2019లో 3,600 మద్యం దుకాణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు చేసి 18 వేల మంది సిబ్బందికి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో జీవనోపాధి కల్పించారన్నారు. దీంతో తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఒక్కసారిగా



రాజమహేంద్రవరంలో డిఎంకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

తమను తొలగిస్తే ఎలా బతకాలని ప్రశ్నించారు. కరోనా సమయంలో తమ ప్రాణాలకు లెక్కచేయక విధులు నిర్వహించామని గుర్తు చేశారు. కాకినాడ జిల్లా గండేపల్లిలో తహశీల్దారు, ఎస్ఐలకు వినతిపత్రాలు అందించారు.

సాంకేతిక విద్యతో బంగారు భవిత

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సాంకేతిక విద్య ద్వారా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందని విప్రో టీమ్ లీడర్ డి.వసంత కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కెరియర్ గైడెన్స్ అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచమంతా కంప్యూటర్‌పై ఆధారపడి నడుస్తోందని, కంప్యూటర్ విద్య విద్యార్థులకు అవసరమని తెలిపారు. కంప్యూటర్ రంగంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాల గురించి, వివిధ రకాల కంప్యూటర్ కోర్సులు గురించి ఆయన వివరించారు. ప్రిన్సిపల్ సునీత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యుత్‌తో పాటు కంప్యూటర్‌పై అవగాహన పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-యానాం

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తన ఎంఎల్ఎ నిధుల నుంచి సుమారు రూ.62 లక్షల నిధులు పిడబ్ల్యూడి, మున్సిపాలిటీ ద్వారా రోడ్లు, డ్రయిన్‌ల నిర్మాణానికి గతంలో నిధులు కేటాయించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక బెజవాడ గార్డెన్‌లో డ్రెయిన్లు, రోడ్లు, కల్వర్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యూడి ఎఇ కాళ్ళ నాగరాజ్, మున్సిపల్ సిబ్బంది , కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

సత్యదేవుని ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఎఐ గుర్తింపు

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం సత్య నారాయణ స్వామి ప్రసాదానికి భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ (FSSAI) గుర్తింపు లభించడం పట్ల ప్రత్తిపాడు ఎంఎల్ఎ మరుపుల సత్యప్రభ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అన్నవరం కొండపై ఎంఎల్ఎ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఎల్ఎ సత్యప్రభ మాట్లాడారు. సత్యనారాయణ స్వామి ప్రసాదానికి స్వచ్ఛత, నాణ్యత, తియ్యదనంలో దేశఖ్యాతి లభించడం అభినందనీయం అన్నారు. ఆలయ సిబ్బందిని, పాలక వర్గాన్ని ఆమె అభినందించారు.



అధికారులను అభినందించిన ఎంఎల్ఎ సత్య ప్రభ

పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో వాహనాల వేలం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలోని పోర్టు పోలీస్ స్టేషన్లో మూడు కేసుల్లో పట్టుబడ్డ రెండు ఫైబర్ పడవలను, ఒక మోటార్ సైకిల్‌కు మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఈ మూడింటికి 18 శాతం జిఎస్‌టితో కలిపి రూ.లక్షా 59 వేలకు ముగ్గురు పాటదారులు వాటిని దక్కించుకున్నారని పోర్టు పోలీస్ స్టేషన్ సిఐ పి.సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో ఈ వేలం నిర్వహించారు. ఒక బోటును రూ.66 వేలకు చేట్ల వెంకటరెడ్డి, మరో బోటును రూ.45 వేలకు సంగాడి ఈశ్వరరావు, బైకును రూ.24 వేలకు కర్రి త్రిమూర్తులు దక్కించుకున్నారు. ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ ఎఎస్.దొర, 27 మంది పాట దారులు హాజరయ్యారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఒక వ్యక్తి నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి చూపునిచ్చినవారవుతారని తాళ్లరేవు మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో శ్రీనివాస్ మాట్లాడారు. మరణించిన వ్యక్తి నుంచి 6 గంటల్లోపు నేత్రం నుంచి కార్నియాను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాకపల్లి చిరంజీవి, గంజా సూరిబాబు, కుడుపూడి దుర్గాప్రసాద్, కాండ్రేకుల శ్రీనివాస్, వడ్డి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో పాల్గొన్న ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విజయవాడలో వరద ప్రాంతాల్లో బాధితులకు సహాయక చర్యలు అందించి, వారికి అండగా నిలిచేందుకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధిన పలువురు ప్రజాప్రతినిధులు అక్కడకు మంగళవారం వెళ్లారు.

అమలాపురం: విజయవాడలో బాధిత కుటుంబాలకు సహాయక చర్యలు అందించి, వారికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంఎల్‌ఎలకు ఆదేశాలు జారీచేశారు. అందులో భాగంగా విజయవాడ 19 వ డివిజన్ లో వరదలో నీట మునిగిన ప్రాంతాలను అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్రమంత్రి గుమ్మడి సంధ్యారాణి, వైజాగ్ జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ లతో కలసి మంగళవారం పర్యటించారు. ఈ పర్యటన లో టిడిపి రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బోళ్ల సతీష్, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దంతులూరి వాసురాజు, ఎస్‌సి సెల్ రాష్ట్ర నాయకులు కోటి తదితరులు ఉన్నారు. **ముమ్మిడివరం:** వర్షాలకు వరదలతో అల్లాడుతున్న భాదితుల సహాయక చర్యల్లో ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొని సేవలందించారు. ఇటీవల కురిసిన వర్షాలతో వరద ఉధతితో అల్లాడుతున్న బాధితులకు సహాయక చర్యలు త్వరితగతిన అందించేందుకు ప్రజా ప్రతినిధులు పాల్గొని సేవలు అందించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో మంగళవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పళ్ళ శ్రీనివాస్‌తో కలిసి ముమ్మిడివరం ఎంఎల్ఎ సుబ్బరాజు పాల్గొని విజయ వాడలోని 60 మరియు 61వ డివిజన్ పరిధిలోని బాధితుల సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లాల తరలింపు

ప్రజాశక్తి-అన్నవరం, జగ్గంపేట

విజయవాడలో కురిసిన భారీ వర్షాలతో అతలాకుతలం అయిన వరద బాధితుల సహాయార్థం అన్నవరం దేవస్థానం నుండి పది వేల పులిహోర ప్యాకెట్లు, 42 వేల మంచినీళ్ల ప్యాకెట్లు, లోవ దేవస్థానం, శ్రీ మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం, కోట సత్తెమ్మ తల్లి దేవస్థానం ద్వారా పదివేల పులిహోర ప్యాకెట్లు మొత్తం 20 వేల ప్యాకెట్లు విజయవాడ కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా బాధితులకు 40 వేల బిర్యానీ ప్యాకెట్లను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తరలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ వరదనీటిలో చిక్కుకున్న అనేక కుటుంబాలు, ఇబ్బందులు పడుతున్నాయన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం

ప్రజాశక్తి - తాళ్లరేవు

త్వరలో జరగబోయే నీటి సంఘాల ఎన్నికలకు రైతులు, నాయకులు సమాయత్తం కావాలని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ఆదేశాలు జారీ చేసినట్టు టిడిపి నాయకులు భజన సత్తిబాబు తెలిపారు. మంగళవారం పటవలలో నిర్వహించిన కూటమి నాయకులు, రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పటవల నీటి సంఘం అధ్యక్షునిగా సత్తిబాబును కూటమి నాయకులు, రైతులు ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొత్తూరు కాశీ ఈశ్వరుడు, దంగేటి అన్వేష్, వత్సవాయి రాజబాబు, చెక్క అయ్యారావు, మేకల కృష్ణ, మేడిశెట్టి గోపాలం, పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం, రిజిస్టర్ల తనిఖీ

ప్రజాశక్తి-అంబాజీపేట

చిరుతపుడిలో రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం జిల్లా వ్యవసాయాదికారి వి.బోసుబాబు సందర్శించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. పిఎసిఎస్‌లో ఎరువుల గోదాముల్లో నిల్వలు, స్టాక్ రిజిస్టర్ లు తనిఖీ చేశారు.ఇ కె వై సి ప్రక్రియ పరిశీలించారు. రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. వరితో పాటు కొబ్బరి, అరటి, కూరగాయల పంటలు ఇకెవైసి నమోదు చేయించుకోవాలన్నారు. ఈనెల 15 వరకూ నమోదు చేస్తారని ఆర్‌బికెల్లో సామాజిక తనిఖీ నిమిత్తం అందుబాటులో రైతుల జాబితా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నేతల నాగరాజు, ఎఒ సిహెచ్‌డి.విజయ్ కుమార్, ఎఇఒ డి.దుర్గారావు, రైతులు బి.రామకష్ణ, ఎల్.నాగేశ్వ రరావు, కె.సుబ్బారావు, విహెచ్ఎ ఎమ్.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ దాడులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల పెరిగిపోతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగించుకోవాలని స్పార్క్ స్వచ్ఛంద సంస్థ సిఇఒ సాయి ప్రదీప్ పిలుపునిచ్చారు. మండలంలోని యర్రవరంలో మంగళవారం ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ స్పై కెమెరా దాడులు, ఫెడెక్స్ కొరియర్ పేరుతో మోసాలు, లైవ్ హ్యాకింగ్‌లపై వివరించారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికీ ఇంటర్నెట్, సెల్ ఫోన్ అత్యవసరంగా మారిందన్నారు, ఇదే అదనుగా భావించిన సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ యాప్స్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కాము కష్టపడి సంపాదించుకున్న సొమ్ము కోల్పోవడంతో పాటు, తమ వ్యక్తిగత డేటాను చోరీ చేసి వేధింపులకు గురి చేస్తున్నారని వీటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పార్క్ సంస్థ కోఆర్డినేటర్ ఆదిత్య సాహుల్, సభ్యులు నాగసాయి, సుధీర్, స్వామి సుభాషిణి, విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారు.

ఎంఎల్ఎ నానాజీకి ప్రజల కృతజ్ఞతలు

ప్రజాశక్తి -కరప

కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ సొంత ఖర్చులతో పూడిక తీత, గుర్రపు డెక్క తీయించడంతో ఆయనకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు తమ పంటకు ఎటువంటి నష్టం జరగకపోవడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం అట్లకట్ట గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బండారు మురళి రైతులు మాట్లడారు. గత ప్రభుత్వంలో రైతులు ఎంత మొర పెట్టుకున్నా పంట కాలువ పూడికలను తీయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముద్రగడ రమేష్, ఎలుగుబంటి శ్రీనివాస్, భక్తుల సతీష్, వీరంరెడ్డి ముత్యాలరావు, యడ్ల శ్రీను, పుల్లయ్య ప్రసాద్, బిరుద భాస్కర్, గంటా నానిబాబు, బండారు ప్రసాద్, నక్కా మల్లేశ్వరరావు, మార్కండేయులు పాల్గొన్నారు

అంగరలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని అంగరలో వాసవి క్లబ్, ఇంటర్నేషనల్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వాసవి, వనిత, వికెఎస్ పి.వార్నియర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్ళకూరి ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి ఫ్రూట్స్, డ్రింక్స్, డ్రై ఫ్రూట్స్ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్స్ కూడా అందజేశారు. అనంతరం బ్లడ్ బ్యాంక్ నిర్వహణకు వచ్చిన 'వైఎస్ఆర్, జక్కంపూడి రామ్మోహన్‌రావు' బ్లడ్ సెంటర్ డాక్టర్లను క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్లు, సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు ,పాల్గొన్నారు.



అంగరలో రక్తదానం చేస్తున్న పలువురు

విద్యార్థులకు సక్రమమైన ఆహారాన్ని అందించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న ఆహారాన్ని సక్రమంగా అందించాలని ఎస్ఎంసి ఛైర్మన్ గుర్లింక చిన్నా కోరారు. భీమనపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని, బియ్యాన్ని, కోడిగుడ్లను పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణం లో ఆహారాన్ని వండి వడ్డించాలన్నారు ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం,ఎన్. సత్యనారాయణ మూర్తి ఉపాధ్యాయులకు చిన్నా పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

మండలంలోని అన్నంపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద డ్వాక్రా మహిళా సంఘాలకు మంగళవారం జన కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ అద్వర్యం లో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రాష్ట్ర అంగన్ వాడి సాధికార డ్వాక్రా మహిళల ఆర్గనైజింగ్ కార్యదర్శి మెండి కమల ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో మహిళ పాత్ర ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని, అలాగే హెచ్ఐవి, ఎయిడ్స్ ఏ విధంగా వ్యాపిస్తుంది, నివారణ మార్గాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీత, వరలక్ష్మి, సిహెచ్ శాంతి గుర్రాల అమలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ముక్కామల పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి-అంబాజీపేట

ముక్కామల పిహెచ్‌సిని ఎంపిడిఒ జివి.సరోవరావు, ఇఒపిఆర్‌డి బి.మమత మంగళవారం తనిఖీ చేశారు. ఫీవర్ సర్వే అంశాలతో వైద్యాధికారిణిలు ఎ.ఇంద్రావతి, జివి.గీతాంజలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-ఆలమూరు

సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలకు మండల పరిధి 18 గ్రామాల్లో ఆయా ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖ అనుమతులు తప్పక పొందాలని ఎస్ఐ ఎం.అశోక్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ ప్రదేశాల్లో నిర్వహించ తలపెట్టిన వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ సూచించారు. ఈ ఏడాది చవితి ఉత్సవాల వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలు చేసిందన్నారు. వినాయక చవితి ఉత్సవాల వల్ల ఎదుటి వారికి ఇబ్బందులు కలగ కూడదని, పందిళ్ల ఏర్పాటు కోసం వినాయక ఉత్సవ కమిటీలు ganeshutsav.net కు గాని ఫోన్ నెంబర్ 7995095800 వాట్సాప్ నంబర్ ను అనుమతి కోసం సంప్రదిస్తే మీ నంబర్ కు వచ్చే లింక్ పై క్లిక్ చేసిన తరువాత మీకు ఓటిపి వస్తుందని వివరించారు. ఆ తరువాత అనుమతి కోరుతూ దరఖాస్తు కోసం గూగుల్ ఫారం ఓపెన్ చేసి అందులో ఉన్న కాలమ్స్ ను పూర్తి చేసిన తర్వాత ఆ దరఖాస్తు ఆధారంగా పోలీసుల విచారణ చేసి సింగిల్ విండో పద్ధతి ప్రకారం అనుమతి మంజూరు చేయనున్నట్టు తెలిపారు. పోలీస్ నిబంధనల ప్రకారం ఇచ్చిన అనుమతి క్యూఆర్ కోడ్ పత్రాన్ని మందిరం ఆవరణంలో అతికించాలన్నారు. నిమజ్జన సమయంలో కమిటీ సభ్యులు జాగ్రత్తలు వహించాలన్నారు. **ఆత్రేయపురం** వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల్లో జరగబోయే వినాయక చవితి ఉత్సవాలను పండుగ వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్ఐ సూచించారు. ఈ ఏడాది చవితి ఉత్సవాల వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలు చేసిందని వివరించారు.

శ్యాం ఫ్యామిలీకి సేవా పురస్కారం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

శ్యాం మ్యాజిక్ ఫ్యామిలీ శ్రీ కాశీ అన్నపూర్ణ సేవ పురస్కారాన్ని అందుకున్నారు. ర్యాలి గ్రామానికి చెందిన శ్యామ్ జాదుగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ రావులపాలెం రెడ్డి కళ్యాణ మండపంలో కాశీ అన్నపూర్ణ సేవా సమితి వారి సేవా పురస్కారాన్ని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, రాష్ట్ర తెలుగు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల రామకష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. శ్యామ్ ఫ్యామిలీ కువైట సమయం నుంచి పలు సేవా కార్యక్రమాలను చేస్తూ వస్తున్నారు. అలాగే ప్రతి శనివారం వాడపల్లి వచ్చే కాలినడక భక్తులకు అల్పాహారం ఇస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-రావులపాలెం

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం రావులపాలెంలో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ వల్ల తాము ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడతామని మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్ మ్యాన్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్ళుగా విధులు నిర్వహిస్తున్న తాము కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేశామన్నారు. తమ కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.